ఏడుపు

శ్రీమతి జి. రాఘవమ్మ

నవ్వటమనేది ప్రతి మానవజీవికి ఎట్లా సహజమో ఏడవటమనేదికూడ సహజం. నవ్వటంకన్నా ఏడవటమే ప్రకృతిలో మరింత సహజమేమోననిపిస్తుంది. నవ్వు ఎడుపు నెట్లా తెప్పిస్తుందో ఏడుపుకూడ నవ్వునట్లాగే తెప్పిస్తుందనడం అతిశయోక్తికాదు; అసంభవంకాదు. ఎక్కువైన ఆనందంతో నవ్వితే ఏడుపు తప్పకుండ వస్తుంది. ఇక ఏడుపు నవ్వు తెప్పిస్తుందనడం విడ్డూరంగా కన్పించినా వాస్తవంమాత్రం కాకపోదు. పుట్టిన బిడ్డ ఏడిస్తేగాని కన్నతల్లి ముఖం వికసించదు. గోడప్రక్కన ఉన్నవాండ్లు ఆ యేడుపు కొఱకు చెవులు నిక్కబెట్టుకొని కూర్చుంటారు. ఆ యేడుపుకన్నా ఆనందాన్నిచ్చే వస్తువు తల్లిదండ్రులకింకొకటి ఉండదు బాలలకు ఏడుపు బలమిస్తుంది. అందుకే 'బాలానాం రోదనం బలం' అన్నారు పెద్దలు. అట్లా అని ఇరవైనాల్గుగంటలు పాలివ్వకుండ పిల్లల నేడిపించమని గాదనుకోండి అర్థం!

ఏది యెట్లాగున్నా యేడుపనేది మానవులలోని అంతర్గత భావాలను, చిరకాలం దాగిఉన్న స్వభావాన్ని బయట పెట్టిస్తుంది. ఒక్కొక్కప్పుడు హృదయభారం తగ్గించడానికికూడ యేడుపు ఉపయోగిస్తుంది. కుమారుడు చనిపోయినాడని హఠాత్తుగా విన్న ఒక తల్లి మ్రాన్పడిపోతుంది. ఆ సందర్భంలో ఒక ఆంగ్లేయకవి 'She must weep or she will die,' అంటాడు. ఆమె ఆ సమయంలో యేడవకపోతే హృదయం వికలమై చనిపోవడం అనివార్యము. మనుష్యుల మనస్తత్వాల ననుసరించి ఈ యేడుపు అనేకరూపాలతో అవతరిస్తుంది. చింతించడం, విచారించడం, ఈ రెండు సమఉజ్జీపదాలు. వీటికన్నా ఒకడిగ్రీ ఎక్కువ ఏగవడం. రోదించడం. విలపించడం రెండు ఒకజాతికి జెందినవి. అన్నిటికన్నా ఏడుపు పెద్దగా వినపడాలనుకుంటే కవి 'భోరున' అనే పదాన్ని పైపదాలకు జతచేస్తాడు. దానితో ఆయేడుపు తారస్థాయి నందుకుంటుంది.

పూర్వకవులు, ప్రస్తుతం కవీశ్వరులమనుకునేవారు అనేకవిధాలుగా పుస్తకాలల్లో యేడిపించి యేడ్చిచూచారు. ఏ యేడుపు కాయేడుపే ఒక వింతగా, అందంగా ఆహ్లాదంగా ఉంటుంది. కాని చదివేవాడిని ఏడ్పించగల ఏడుపు నూటికో పుస్తకంలో దొరుకుతుంది. ఆయేడుపే నిజమైన యేడుపు. కవి యొక్క హృదంతరాళాలనుంచి పెల్లుబికి బయటబడిన

విచారం, అదే నిజమైన యేడుపు. మిగిలిన యేడుపులన్నీ కల్లబొల్లి యేడుపులు.

ఈ యేడుపులను గురించే తెనాలి రామకృష్ణుడు తెలివిగా అన్నాడు. "అలసాని పెద్దన అటు ఇటు యేడ్చాడు, ముక్కు తిమ్మన ముద్దుముద్దుగా ఏడిచాడు, భట్టుమూర్తి బావురని యేడ్చాడని" హృదయాన్ని కదిలించే యేడుపైతే రామకృష్ణుడా మాట అనగలిగి ఉండడు. ఇది రామకృష్ణుడనినా అనకపోయినా నిజం మాత్రమంతే. ఆ యేడుపులు ఏడ్చిన తీరు చూస్తే వర్ణనలకు ఆహ్లాదం, ఉపమానాలకు సంతోషం మాత్రం కలుగుతుంది కాని వారి యేడుపులకు సానుభూతి మాత్రం కల్గదు.

కలకంఠం వధూకలకాకలీధ్వనితోడి ఏడుపు తిమ్మన్నగారిది. ఎర్రెత్తియారాజీవనను ఏడ్పించాడు కాంభోజీ మేళ విపంచికారవంతో భట్టుమూర్తి.

"కవుల చమత్కారం ఈ ఏడ్పులను ప్రదర్శించడంలో వ్యక్తమౌతుంది." "నీరునిండిన తెప్పలదిమి కన్నులు గప్పికొన జూచి" ఆ ముఖాన్ని కవి దుర్దినపు మెట్టతామరతో బోల్చినాడు.

అదే మేఘసందేశంలో యక్షుడు మేఘునిలో "ఆయబల కృచ్ఛ్రముగ బ్రాణముల బిగబట్టికొని యుండ గుండె చెఱువై పోయి నీకు తప్పక కనుల నీరు జలజల రాలు" నంటాడు. ఈ గుండె చెఱువై పోవడం ఏడ్పుల్లో చాలపెద్దది.

శ్రీ C. R. రెడ్డిగారు ఈ ఏడ్పులోనిఒక దృశ్యాన్ని మనకండ్లముందు నిలిపాడు.

లేనగవును కన్నీళ్లును
గానెద తట తటయనంగ గాంతుని యెదుటన్
వానయు నెండయు గలసెను
చో నొప్పెడు నభమనంగ సుందరినిలిచెన్.

ఆకవియే 'అంపకాలు' అనే శీర్షిక క్రింద మగవాని శోకాన్ని ఎంత మాధుర్యంగా వర్ణించాడో చూడండి. ఈ అంపకాల నాటి ఏడుపు ఆనందంతో కూడిన దుఃఖమనవచ్చు. అది ఆపితే ఆగేది కాదు. పెండ్లికూతురు తరఫున కంట తడిబెట్టని స్త్రీ సామాన్యంగా అరుదు. ఆ సమయంలో చాలమంది మగవారు కూడ గుండె చిక్కబట్టుకోలేరు. ఈ కవిగారు ఆ తరగతితో చేరినవాడు. ఈ కుమార్తె ఏ కుమార్తె అయినాగాని వ్వండి. ఆయన హృదయం విప్పిచూపాడు.

ఘనతర కూర్మి బెంచిన
తనయను నే ధార వోసి ధన్యుడనయ్యెన్
మునిగితి శోకార్ణవమున
మనసున కున్ సుఖములేని మందిరమయ్యెన్.

ఇకలవంగిని కోలు పోయిన పండితరాయల దుఃఖాన్ని కనుగొనండి – "కన్నులనుండి జారి తొలుకాడు నవాంబుద వర్షధారలో నున్న కవీంద్రుడే యచలితోన్నతదైవతకాద్రి పోలునో"

ఇక ఈ ఏడుపు సహజంగా స్త్రీలసొత్తు. సామాన్యంగా ఏడవని స్త్రీ ఉండదు. మగవాడు అరుదుగా ఏడుస్తాడు. ఏడుపును అదుపులో పెట్టుకునే శక్తి స్త్రీకన్నా మగవానికి ఎక్కువ అనటం నిస్సందేహం. కొన్ని పరిస్థితులలో కఠినంగా ఏడుపును దిగమింగే స్త్రీలు లేకపోలేదు. స్త్రీలు ఈ యేడుపును ఆయుధంగా వినియోగించుకోవచ్చు. కాని అది హద్దులుదాటితే అసహ్యాకర పరిణామాలకు దారితీయవచ్చు. పగలల్లా పనిచేసి సాయంత్రానికి యింటికివచ్చే మగవానిని చిఱునవ్వుతో పలకరించే భార్యే స్వర్గం. అతని కష్టమంతా దానితో కరిగిపోతుంది. కాని ఏడుపు ముఖంతో ఇంట్లో ఏడుస్తు కూర్చుండే భార్యను చూసి ఏమగవాడు భరించగల్గుతాడు! మగవాడికి ఏడిచే భార్యను చూస్తే కలిగే అసహ్యం ఇద్దరి శత్రువుల మధ్యకూడ ఉండదేమో? చిన్న పొన్న విషయాలకు ఏడుపు నెత్తిమీదనుండే స్త్రీ తనసంసారాన్ని నరకరూపంగా తయారుచేసుకుంటుందే కాని ఆనందనిలయంగా చేయలేదు. ఎప్పటికీ సహజంగా దుఃఖమనేది కష్టాన్ని సూచిస్తుందేగాని మరొకటికాదు. స్త్రీ ఏడుపును తగిన కాలంలోనే వినియోగించుకోవలె. విపత్కరపరిస్థితుల్లో ఎడుపును ఉపయోగించి ఇతరుల మనసును కరిగించగల జాణలెందరో ఉన్నారు. కాని వినియోగించడానికి ఏడుపు తెప్పించుకుంటే వచ్చేదికాదు. వచ్చినా అది స్వభావనైర్మల్యాన్ని చాటక కుటిలత్వాన్ని ప్రక్కవారికి పట్టిస్తుంది.

ఏడ్చే మగవాణ్ణి వెనక్కుతిరిగే దున్నపోతును నమ్మకూడదన్నారు పెద్దలు. మగవాడు సాధారణంగా ఏడవడు. తఱచు ఏడ్చే మగవాడిని మగవాండ్లే అసహ్యించుకోవడం సహజం. అతనిలో స్త్రీత్వం పాలు ఎక్కువ క్రిందనే జమగట్టబడతాడు. అతనికి గౌరవంకూడ అందరిలా ఉండదు కూడ. విపరీతమైన హృదయ భారాన్ని ఏడుపు దగ్గిస్తుంది. స్త్రీకి సిగ్గు ఎటువంటిదో దాని ఆకర్షణ స్త్రీకెంత సహాయపడుతుందో ఏడ్పు నవ్వుకూడ అంతే సహాయకారులు అంటాడు హావలక్ ఎల్లిస్.

పసిబిడ్డల ఏడుపులోని మాధుర్యం చిఱునవ్వులోని తీయదనం తల్లికి తెలుసు. బిడ్డ ఏడుస్తుంటే తల్లిపడేబాధ తండ్రి పడడు. కాని బిడ్డల నేడవనీయకుండ గొంతెత్తగానే పాలపీక నోటితో పెట్టే తల్లులుకూడ లేకపోలేదు. కాని బిడ్డకు ఏడుపువల్ల అనేకలాభాలున్నాయనే విషయం వారు తెలిసికొని ఉండరు. బాలురు ఆరోగ్యంగా ఉండడానికి కావలసిన గ్లాండ్సు కొన్ని ఏడుపువల్ల అభివృద్ధి చెందుతాయి.

అందువల్లనే బాగుగా ఏడవని పిల్లలు బాగుగా నవ్వలేరంటారు. అది వాస్తవం.

శారీరకంగా శక్తి తగ్గేటప్పటికి ఏడుపు ఎక్కువగావడం సహజం. మగవాండ్లలో కోపమెక్కువైతే స్త్రీలలో ఏడుపు ఎక్కువౌతుంది. కాని దీనికి సంపూర్ణంగా వ్యతిరేకోదాహరణలు లేకపోలేదు.

ఇక వేదాంతానికొస్తే అంతా దుఃఖమయమేనంటారు వేదాంతులు. నవీనులు మెట్ట వేదాంతమన్నా అది నిజమేమోననిపిస్తుంది. నిజమైనా కాకపోయినా లోకంలో ప్రతిక్షణం జరిగేదే అది. దుఃఖభూయిష్టమైన జగతి ఆనందవంతం చేసుకోవడం మానవ ధర్మం. అందుకే మానవజననం,

జన్మదుఃఖం జరా దుఃఖం జాయాదుఃఖం పునఃపునః
సంసార సాగరం దుఃఖం తస్మాత్ జాగ్రత జాగ్రతః

అన్నారు పండిత ప్రకాండులు అనుభవించి చూచి జీవితాన్ని ఆనందవంతం చేసుకోలేక—



"సౌత్ ఇండియా ఆఫీసు 5/149, బ్రాడ్వే, మద్రాసు 1."